క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ కేకే సొసైటీ, ఐడీఏ -2 ఫీడర్ల పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, హనుమాన్ వేబ్రిడ్జి రోడ్డు, చౌదరి వేబ్రిడి, అదే విధంగా ప్రశాంత్‌నగర్, ఐడీఏ-1 ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు హరియానా వేబ్రిడ్జి, మజీద్ గల్లీ, డెక్కన్ కాంటా లేన్, అయ్యప్ప కాలనీ టెంపుల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ డీఈ రాధాకిషన్ అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో 12వ తేదీన చంద్రానగర్ కమ్యూనిటీహాల్ వద్ద, 13వ తేదీన భగత్‌సింగ్‌నగర్ గవర్నమెంట్ స్కూల్ వద్ద, 14వ తేదీన దేవమ్మబస్తీలోని గణేష్ మండపం వద్ద, 15వ తేదీన రాజీవ్ గ్రహకల్ప, సంజయ్‌పురి కాలనీలలో కమ్యూనిటీ హాల్ వద్ద బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత



కుత్బుల్లాపూర్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్క్లేవ్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి జరిగిన అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న శ్రీశైలంగౌడ్ ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, నాయకులు బాలప్ప, పుప్పాల భాస్కర్, వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'స్టేషన్‌కు పిలిపించామే తప్ప ఎవరిని అరెస్ట్ చేయలేదు'

దుండిగల్: ఇరువర్గాల మధ్య నడుస్తున్న స్థల వివాదం నేపథ్యంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను దుండిగల్ పోలీసులు స్టేషన్‌కు పిలిపించడం ఆందోళనకు దారి తీసింది. సూరారం కాలనీ సర్వే నం.105లో ఉన్న సిద్ధివినాయకనగర్‌లోని 1080 గజాల స్థలాన్ని పార్కు కోసం విడిచిపెట్టామని కాలనీ అసోసియేషన్ సభ్యులు... సదరు స్థలం తమకు చెందిందని ప్రైవేట్ వ్యక్తుల మధ్య కొన్ని సంవత్సరాలుగా వివాదం నడుస్తోంది. ఈ విషయమై ఇప్పటికే పోలీస్‌స్టేషన్, జీహెచ్‌ఎంసీలో ఫిర్యాదులు సైతం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం దుండిగల్ పోలీసులు కాలనీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ధారం సాయికుమార్‌లను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. దీంతో రాజకీయ ఒత్తిడితో కబ్జాదారులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ కాలనీ వాసులు దుండిగల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని కబ్జా చెర నుంచి కాపాడాలని ఫిర్యాదు చేసిన వారినే అరెస్టు చేయడం అన్యాయమని కాలనీవాసులు పేర్కొంటున్నారు. కాగా సీఐ రమణారెడ్డి స్థలంలో కడీలను తొలగించిన నేపథ్యంలోనే ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకే తాము కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అందులో భాగంగానే అసోసియేషన్ సభ్యులను స్టేషన్‌కు పిలిపించామే తప్ప ఎవరిని అరెస్ట్ చేయలేదని పేర్కొనడం గమనార్హం.

కట్ట మైసమ్మ రేణుకాఎల్లమ్మ జాతర షురూ

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు
- నేటి ప్రధాన జాతరకు అన్ని ఏర్పాట్లు



కట్టమైసమ్మ అమ్మవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



విశేష అలంకరణలో సూరారం కట్టమైసమ్మ

సుభాష్‌నగర్: సూరారంలోని కట్ట మైసమ్మ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. మొదటిరోజు అభిషేకం, గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ, నవవర్ణ జప హోమం, కల్యాణ తలంబ్రాలు, ఒడి బియ్యం సమర్పణ, సాయంత్రం సూరారం గ్రామం నుంచి అమ్మవారి ఊరేగింపు తదితర కార్యక్రమాలు జరిగాయి.

ప్రధాన జాతరకు అన్ని ఏర్పాట్లు..

ఆదివారం జరిగే ప్రధాన జాతరకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఆలయ కమిటీ పేర్కొంది. జాతరలో పారిశుద్ధ్య, మంచి నీటి, నిరంతర విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించామన్నారు.

ఏసీపీ సందర్శన..

ఆదివారం జరిగే ప్రధాన జాతర సందర్భంగా పేట్‌బషీరాబాద్ ఏసీపీ వెంకట్‌రెడ్డి శనివారం సీఐ రమణారెడ్డిలతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

వాహనాల మళ్లింపు..

ప్రధాన జాతరను దృష్టిలో ఉంచుకుని జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసుల నేతృత్వంలో సూరారం చౌరస్తా నుంచి జ్యోతి మిల్క్ వరకు వన్ వే ఏర్పాటు చేయనున్నారు. భారీ వాహనాలను సూరారం గ్రామం మీదుగా గండి మైసమ్మ, మియాపూర్ ప్రాంతాలకు మళ్లించనున్నారు.



కల్యాణం అనంతరం హారతి ఇస్తున్న మహిళలు



అమ్మవారిని దర్శించుకున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి,సీఐ రమణారెడ్డి తదితరులు

ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



సీఎం కేసీఆర్‌కు పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న శంభీపూర్‌రాజు

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి నోటీఫికేషన్ జారీ చేశారు. ఆది నుంచి కేసీఆర్ కుటుంబానికి సన్నిహితుడిగా ముద్ర పడిన శంభీపూర్‌రాజు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరిస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. మంత్రి కేటీఆర్ అనూంగ శిష్యుడిగా కొనసాగుతూ వస్తున్నారు.

◆ 2001లో టీఆర్ఎస్ పార్టీలో రాజకీయ రంగ ప్రవేశం చేసిన శంభీపూర్‌రాజు, 2002లో కుత్బుల్లాపూర్ మండల టీఆర్ఎస్ యువజన విభాగం ట్రెజరర్‌గా నియమితులయ్యారు.

◆ 2004లో టీఆర్ఎస్ బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. 2006లో టీఆర్ఎస్ యువజన విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, 2008లో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా, 2009లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు.

◆ 2011లో టీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ జనరల్‌గా పని చేసిన ఆయన 2015లో రంగారెడ్డి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

◆ 2017లో టీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా, 2021లో తిరిగి రెండోసారి ఎమ్మెల్సీగా ఎంపికైన ఆయన మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా సైతం కొనసాగుతున్నారు.

◆ ప్రభుత్వ కార్యక్రమాలు, సభల్లో చురుగ్గా పాల్గొనడమే కాకుండా పార్టీ కేడర్‌లో తనదైన ప్రభావం చూపుతూ వస్తున్నా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును తాజాగా రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రభుత్వ విప్‌గా నియమించడం విశేషం. ఈ నేపథ్యంలో శంభీపూర్ రాజు శనివారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను కలిసి కృతజ్ఞతలు తెలియజేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

కాంగ్రెస్‌ను మెజార్టీతో గెలిపించి అధికారం కట్టబెట్టాలి



రామిరెడ్డినగర్‌లో హాత్‌సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

జీడిమెట్ల: బంగారు తెలంగాణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శనివారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి గంపల బస్తీ, రామిరెడ్డినగర్‌లో ఆయన పాదయాత్ర చేపట్టారు. గడప గడపకు హాత్ సే హాత్ జోడో స్టిక్కర్లను అతికిస్తూ కాంగ్రెస్ పార్టీని బలపరచాలని ప్రజలను అభ్యర్థించారు.

◆ ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఒకటేనని అన్నారు. ఆ ప్రభుత్వాలు స్వప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి అధికారం కట్టబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, శ్రీధర్ రెడ్డి, జేమ్స్, గురువారెడ్డి, వీరేష్‌గుప్తా, రాంచందర్, హేమరాణి, పండరిరావు తదితరులు పాల్గొన్నారు.

నాలాల అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించాలి

అసెంబ్లీలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న నాలాల అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే వివేకానంద్ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. శనివారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ అభివృద్ధి పనులపై మాట్లాడారు.

◆ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎస్ఎన్‌డీపీ పనులకు కేటాయించిన రూ.985 కోట్లలో సుమారు రూ.200 కోట్ల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 3 నాలాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వీటిలో 2 నాలాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పనులు పూర్తయిన ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా కొంత ఊరట లభిస్తుందన్నారు. ఇందుకు సహకారం అందించిన పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

◆ ఆయా నాలాల నిర్మాణానికి ప్రతిపాదించిన నిధులు జీఎస్టీ కారణంగా 15 నుంచి 20 శాతం పెరగడంతో పనులు పూర్తి కావడం లేదని, అదనంగా నిధులు మంజూరు చేస్తే పనులు వేగంగా పూర్తవుతాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా ఫాక్స్ సాగర్ కోల్ నాలా ప్రాజెక్ట్ అనుకున్న సమయంలో పూర్తి చేయాలంటే అదనంగా రూ.10 కోట్లు మంజూరు చేయాలన్నారు.

◆ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొంత పనులు మిగిలి ఉన్నాయన్నారు. శ్రీనివాస్‌హౌసింగ్ కాలనీలో 200 మీటర్లు అదనంగా నాలా నిర్మించాల్సి ఉందని అందుకు అదనంగా నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తవుతాయని మంత్రికి వివరించారు.

◆ ఎస్ఎన్‌డీపీ ఫేస్-2లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టబోయే పనులకు వ్యయ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కొత్తగా ఏర్పాటైన కొంపల్లి, ఫీర్జాదిగూడ, బడంగ్‌పేట్ అర్బన్ పురపాలక సంఘాలకు సైతం నిధులు మంజూరు చేయాలన్నారు.

◆ ముఖ్యంగా నాలాలను రెవెన్యూ,ఇరిగేషన్,మున్సిపాలిటీ రికార్డ్స్‌లో పొందుపర్చే విధంగా చర్యలు చేపడితే కబ్జాలకు తావు ఉండదని ఎమ్మెల్యే వివేకానంద్ సభాముఖంగా మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై మంత్రి కేటీఆర్ సమాధానమిస్తూ అభివృద్ధి పనులకు రూపొందించిన ప్రతిపాదనలకు అనుగుణంగా నిధులు కేటాయించి వాటిని పూర్తి చేసేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



సూరారంకాలనీ ఆర్యవైశ్య కమిటీహాలులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: కుల సంఘాలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సూరారం కాలనీ ఆర్యవైశ్య కమిటీ హాలులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ... బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంతో స్థానికంగా ఉన్న పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కుల సంఘాలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలన్నారు. ఏ ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినా తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కృష్ణమోహన్, రమేష్, సభ్యులు ఉద్రావఝ్ఝల సంజీవరావు, చక్రధారి శ్రీరామ్‌శర్మ, నిట్టల సుబ్రహ్మణ్యం, రాచపూడి ప్రభాకర్ శర్మ, హరి రాఘవేంద్రశర్మ, దుర్గానాగమోహన్, సీఎంఆర్ హాస్పిటల్ పీఆర్‌వో దుర్గా ప్రసాద్, వైద్యులు ప్రవళిక, రియాజ్, మధు తదితర వైద్య బృందం పాల్గొన్నారు.

విద్యావిధానంలో అనూహ్య మార్పులు రానున్నాయి

ఆర్ఎస్‌కే స్కూల్ కరస్పాండెంట్ రామేశ్వర్‌రెడ్డి



ఆర్ఎస్‌కే స్కూల్‌లో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

కుత్బుల్లాపూర్: విద్యావిధానంలో అనూహ్యమైన మార్పులు రానున్నాయని బాపూనగర్ ఆర్ఎస్‌కే స్కూల్ కరస్పాండెంట్ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భవిష్యత్ విద్యావిధానంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యా విధానంలో సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తూ విద్యార్థులకు బోధన చేయనున్నామని తెలిపారు. దీంతో గుణాత్మకమైన మార్పులు చోటు చేసుకోనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ అరుణారెడ్డి, కో.ఆర్డినేటర్ శోభ, ఉపాధ్యాయులు ఉషనిర్మల, దేవేంద్ర, లీడ్ ప్రతినిధులు మురళీ, అభయ్, కృష్ణచైతన్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నాం



కేటీఆర్‌కాలనీ పార్కులో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: సుపరిపాలన అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి 11వ డివిజన్ పరిధి కేటీఆర్ కాలనీ పార్కులో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ వాకలపూడి రవికిరణ్‌లతో కలసి మేయర్ మొక్కలు నాటారు. పార్కులో జరుగుతున్న వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, చిల్డ్రన్స్ స్పేస్, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ... కార్పొరేషన్ పరిధిలో ఉన్న పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఎన్ని నిధులు ఖర్చయినా ప్రజల సౌలభ్యం కోసం వెనుకడు వేసే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ రాజేశ్వరి, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు పద్మప్రసాద్, మహిళాఆయకురాలు సబిత, 11వ డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ, కేటీఆర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు వైజయంతి మాల, రాజశేఖర్, శేషగిరి, బాలాజీ కాలనీ వాసులు, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫౌంటేన్ కాదు వాటర్ లీకేజ్...

చింతల్: ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ ఉండాలన్న ఉద్దేశంతో జలమండలి కుత్బుల్లాపూర్‌లో సుమారు 99 కిలోమీటర్ల పరిధిలో నూతన పైప్‌లైన్ విస్తరణ చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కొన్ని నెలల క్రితం గాజుల రామారం గ్రామంలో హెచ్‌డీపీ పైప్‌లైన్ పనులను ఓ ప్రముఖ ఇంజినీరింగ్ సంస్థ పనులు పూర్తి చేసింది. శనివారం గ్రామంలోని ఓ రేషన్ షాప్ వద్ద పైప్ లైన్‌కు లీకేజీ ఏర్పడి వాటర్ ఫౌంటేన్‌ను తలపించింది. బిల్డింగ్ మొదటి అంతస్తు ఎత్తు వరకు నీరు వెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. సుమారు గంటన్నర తర్వాత జలమండలి అధికారులు నీటి సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.



గాజులరామారం గ్రామంలో..

ఎంఎల్ఆర్ఐటీలో వేడుకగా ట్రెడిషనల్ డే



అధ్యాపకులతో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి



సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలో శనివారం సంప్రదాయ దినోత్సవంఘనంగా జరిగింది. కళాశాలకు చెందిన కేమ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి, మేళతాళాలు, ఆట పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా దాండియా, బతుకమ్మ తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ట్రెడిషనల్ డేను ఏర్పాటు చేశామని కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శ్రీ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, కోశాధికారి మర్రి మమత రెడ్డి, డైరెక్టర్ మర్రి అనుశ్రేయారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులను రాష్ట్రం పక్కదారి పట్టిస్తోంది

'ప్రజాగోస - బీజేపీ భరోసా'లో మధ్యప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు



కొంపల్లిలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

కుత్బుల్లాపూర్: తెలంగాణలో దొరల పాలనను కొనసాగిస్తూ పేదల ఇబ్బందులను బీఆర్ఎస్ ప్రభుత్వ విస్మరిస్తోందని బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మధ్యప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు అన్నారు. ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 1వ వార్డులోని గాంధీ కాలనీలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు మురళీధర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రం వ్యాప్తంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయినా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంత వరకు లబ్ధిదారుల పేర్లను వెల్లడించకపోవడం దారుణమన్నారు. ప్రజా సంక్షేమానికి కేంద్రం విడుదల చేస్తున్న నిధులను రాష్ట్రం ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని అన్నారు.

◆ అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సైతం రాష్ట్ర పథకాలుగా పేర్కొనడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 11 వేల స్ట్రీట్ మీటింగ్‌లు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ నరేందర్‌రావు, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సరితారావు, శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.